RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 13 సంచిక : 135 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం మంగళవారం, 19 నవంబర్ 2024 పేజీలు : 4 వెల : 2/-



# కమలం కనుమరుగే

## 'మహారాష్ట్రలో బీజేపీ ఓటమి ఖాయం.. అందుకే ప్రధాని పారిపోయారు'

## మహారాష్ట్రలో ముగిసిన ఎన్నికల ప్రచారం

మహారాష్ట్రలో కాంగ్రెస్‌పార్టీ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ కూటమి విజయం దక్కించుకుంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తాజాగా ఆయన జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంపై స్పందించారు. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని కూటమి పట్ల మహారాష్ట్ర ప్రజలు చాలా విశ్వాసంతో ఉన్నారని తెలిపారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోసి ఇక్కడ బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పుడు మహాయుతిని మట్టుబెట్టేందుకు మహారాష్ట్ర ప్రజలు రెడీగా ఉన్నారని రేవంత్ చెప్పారు. ఈ విషయం తెలుసు కాబట్టే.. బీజేపీ ఓటమి ఖాయమని నిర్ణయించుకున్నారు కాబట్టే.. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విదేశాలకు పారిపోయారని(విదేశీ పర్యటనకు వెళ్లారు) రేవంత్ నిప్పులు చెరిగారు. బీజేపీ సహా ప్రధాని మోదీ మహారాష్ట్రలో ఓటమిని ముందుగానే అంగీకరించారని తెలిపారు.

ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు విభజన రాజకీయాలు చేస్తున్నారని విమర్శలు గుప్పించారు. ఆసాంతం హిందీలో మాట్లాడిన రేవంత్‌రెడ్డి ప్రధాని సహా బీజేపీ నేతలపై విమర్శలు గుప్పించారు. మూడేళ్ల మహాయుతి పాలనలో మహారాష్ట్రలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదన్నారు. చెప్పుకొనేందుకు ఏమీ లేక.. కాంగ్రెస్ కూటమి మహావికాస్ అఘాడీపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. విభజిత రాజ కీయాల ద్వారా లబ్ధి పొందాలని చూసే మోడీ ఆయన పరివారానికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని తెలిపారు. మహావికాస్ అఘాడీ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందన్నారు. కానీ, 288 అసెంబ్లీ స్థానాలున్న మహారాష్ట్ర శాసన సభకు.. ఈ నెల 20న ఒకే విడతలో ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు ప్రచారం ముగిసింది. బీజేపీ నేతృత్వంలోని మహాయుతి, కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ కూటములు ఢీ అంటే ఢీ అన్నట్టుగా తలపడుతున్నాయి. ఇరు పక్షాలు వారి వారి ముఖ్యమంత్రులను అగ్ర నాయకులను రంగంలోకి దింపి ప్రచారం సాగించాయి.




## ముదురుతున్న మాటల యుద్ధం ... ఎమ్మెల్యే కడియంకు రాజయ్య సవాల్

వరంగల్ : తెలంగాణలో హాట్ టాఫిక్‌గా మారిన స్టేషన్ ఘన్‌పూర్ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. బీఆర్ఎస్ నేత, తెలంగాణ మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్యకు కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్ విసిరారు. అయితే ఈ సవాల్‌కు రాజయ్య ప్రతి సవాల్ విసిరారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో రాజయ్య, కడియం శ్రీహరి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఇటీవల రాజయ్య చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను కడియం శ్రీహరి తప్పుబట్టారు. తాజాగా కడియం శ్రీహరి చేసిన విమర్శలపై రాజయ్య తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

**వారిని విమర్శిస్తే చూస్తూ ఊరుకోం...** బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కడియం శ్రీహరిపై మాజీ మంత్రి తాటికొండ రాజయ్య నిప్పులు చెరిగారు. స్థాయిని మరిచి బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌ను విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని కడియం శ్రీహరికి తాటికొండ రాజయ్య వార్నింగ్ ఇచ్చారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి తాటికొండ రాజయ్య విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్‌లపై కడియం శ్రీహరి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు.

**సవాళ్ల పర్వం..** స్టేషన్ ఘన్‌పూర్‌లో కడియం శ్రీహరి , రాజయ్యల మధ్య సవాళ్ల పర్వం నడుస్తోంది. నిన్న కడియం శ్రీహరి చేసిన సవాల్‌ను రాజయ్య స్వీకరించారు. "స్టేషన్ ఘన్‌పూర్‌లో నువ్వా.. నేనా మన ఇద్దరిలో ఒక్కరే మిగలాలి. నువ్వు దళిత ద్రోహివి..స్థానికేతరుడివి. నిన్ను స్టేషన్ ఘన్‌పూర్ నుంచి తరిమే వరకు నేను నిద్రపోను. కడియం శ్రీహరి అవినీతి చిట్టా మొత్తం బయట పెడతా. నిన్ను వదిలే ప్రసక్తే లేదు. నీ అల్లుడుని అడ్డం పెట్టుకుని స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో భూములు కబ్జా చేస్తున్నది నిజం కాదా. నీ భూ కబ్జాలు బయటపెట్టడానికి నేను సిద్ధం.

నువ్వు సత్య హరిశ్చంద్రుడివి అయితే నీ బిడ్డను ఎంపీని చేయడానికి రూ.100 కోట్లు ఎలా ఖర్చు పెట్టావు. ఆ డబ్బు ఎక్కడిది" అని కడియం శ్రీహరిపై రాజయ్య ప్రశ్నల వర్షం కురిపించారు.




సంగారెడ్డి: ఆక్రమణలు చేసిన అక్రమార్కుల పాలిట ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా ఇవాళ (సోమవారం) మరిన్ని కూల్చివేతలు చేపట్టింది. హైడ్రా మళ్లీ దూకుడు పెంచింది.

నగర శివారు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఫోకస్ పెట్టింది. అమీన్ పూర్ వందనపురి కాలనీలో 848 సర్వే నంబర్‌లో అక్రమ నిర్మాణంపై కొరడా ఝుళిపించింది. రోడ్డును ఆక్రమించి నిర్మించిన భవనాన్ని కూల్చివేశారు. నోటీస్ ఇచ్చినప్పటికీ ఇళ్లను తొలగించకపోవడంతో హైడ్రా సీరియస్ అయింది. భారీ యంత్రాలతో అక్రమ నిర్మాణాన్ని హైడ్రా సిబ్బంది కూల్చివేస్తున్నారు.

**వందనపురి కాలనీలో హైడ్రా చర్యలు..** అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఈరోజు హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. వందనపురి కాలనీలో 848 సర్వే నంబర్‌లో అక్రమ నిర్మాణంపై కొరడా ఝుళిపించారు.కొంతమంది రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టారు. భారీ యంత్రాలతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు వాటిని కూల్చివేస్తున్నారు. అమీన్ పూర్‌లోని వందనపురి కాలనీలో అక్రమ భవనాన్ని హైడ్రా అధికారులు కూల్చివేస్తున్నారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలో మరో రెండు చోట్ల అక్రమ నిర్మాణాలను గుర్తించారు. ఇటీవల నాగారం మున్సిపాలిటీలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన ఇళ్లను కూల్చివేశారు. ముందుగానే హైడ్రా అధికారులు నోటీసులు ఇచ్చి 15 రోజులు గడువు ఇస్తున్నారు. రెండు వారాల్లో నిర్మాణాలను యజమానులే ఆక్రమణలు తొలగించకపోతే హైడ్రా రంగంలోకి దిగనుంది. తెలంగాణలో అక్రమ నిర్మాణాల కూల్చివేతల కోసం కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న సంచలన నిర్ణయమే హైడ్రా. దీనిని ఏర్పాటు చేసి మూడున్నర నెలలు దాటింది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న చాలా అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చి వేసింది. రాష్ట్ర చరిత్రలోనే మూడున్నర నెలల వ్యవధిలో 300కు పైగా అక్రమ నిర్మాణాల హైడ్రా నేలమట్టం చేసింది. ప్రభుత్వ ఆస్తులు, చెరువుల పరిరక్షణ కోసం జూలై 19వ తేదీన హైడ్రాను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో 99ను తీసుకువచ్చింది. దీంతో జూలై 26వ తేదీ నుంచి కూల్చివేతలను మొదలుపెట్టింది హైడ్రా. ఇప్పటి వరకు 30కు పైగా ప్రాంతాల్లో 300కు మించి ఆక్రమణలను కూల్చివేసింది. 100 రోజుల్లో 120 ఎకరాలను ప్రభుత్వానికి అప్పగించింది. జీహెచ్‌ఎంసీతో పాటు 27 మున్సిపాలిటీలు, 33 గ్రామాల్లో హైడ్రా దూకుడు మామూలుగా లేదు. హీరో నాగార్జున ఎన్ కన్వెన్షన్ కూల్చివేతతో దేశవ్యాప్తంగా హైడ్రా పేరు మార్మోగింది.

## సంగారెడ్డిలో కూల్చివేతలు

## అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఉక్కుపాదం

**తీవ్ర వ్యతిరేకత రావడంతో..** అయితే.. హైడ్రా కూల్చివేతలపై ప్రజలు హడెలెత్తిపోయారు. ఎప్పుడు ఎవరి ఇంటిని కూల్చివేస్తారో అని భయాందోళనలో ఉన్నారు. హైడ్రా కూల్చివేతలపై పలు చోట్ల తీవ్రమైన వ్యతిరేకత కూడా వచ్చింది.

పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించగా.. హైడ్రా చట్టబద్ధతపై కోర్టు కూడా ప్రశ్నించింది. జీవో 99పై స్టే ఇవ్వాలంటూ అనేక మంది హైకోర్టులో పిటిషన్‌లు వేశారు. ఈ క్రమంలో హైడ్రాకు ఎదురవుతున్న ఆటంకాలు తొలగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ రూపకల్పన చేసింది. ఈ ఆర్డినెన్స్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోద ముద్ర వేశారు.

**పూర్తిస్థాయిలో బాధ్యతలు...** ఇటీవల ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ బాధ్యతలను పూర్తిస్థాయిలో హైడ్రాకు అప్పగిస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రేటర్ పరిధిలోని అక్రమ కట్టడాలన్నీ కూల్చివేసే పవర్ హైడ్రాకు ఇచ్చింది.

ఈ మేరకు జీవో నెంబర్ 199ను ప్రభుత్వం విడుదల చేసింది. జీహెచ్‌ఎంసీ చట్టంలో పలుమార్పులు చేసింది. జీహెచ్‌ఎంసీ చట్టంలో మున్సిపల్ శాఖలో 374B ప్రత్యేక సెక్షన్ చేర్చింది. దీంతో బల్దియాతో పాటు 27 మున్సిపాలిటీలు, 33 గ్రామాల పరిధిలో హైడ్రా దూకుడు పెంచింది. ఇక నుంచి జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రభుత్వ ఆస్తులను పరిరక్షిస్తారు. అక్రమ కట్టడాలకు నోటిసుల జారీ నుంచి కూల్చివేతల వరకు అన్నీ హైడ్రా అమలు చేయనుంది.





# మాట తప్పి చేతులెత్తేసిన రేవంత్

## మహారాష్ట్ర ప్రచారంలో పవర్ స్టార్ పంచులు!

హైదరాబాద్ : జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఎన్డీఏ అభ్యర్థుల తరపున ఆయన ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ రోజు ఓ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతుండగా.. తెలంగాణ నుంచి వచ్చి స్థిరపడిన ప్రజలు ఆయనను పలకరించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. మీకు తెలుసు కదా తెలంగాణ అంటే నా గుండె ఎలా కొట్టుకుంటుందోనని అన్నారు. బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి తనకు ఇష్టమైన పాట అని గుర్తు చేశారు. తెలంగాణ పోరాటాల గడ్డ అని అన్నారు. అధికారంలోకి వస్తే మహిళలకు ప్రతీ నెల ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో మాట నిలబెట్టుకోలేకపోయిందని విమర్శించారు.

**బీజేపీ బందిపోటు ముఠా అంటూ రేవంత్ విమర్శలు..** మరోవైపు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సైతం మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ తో పాటు మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా.. మోదీ, అదానీపై ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. గుజరాత్ నుంచి ప్రధాని, అదానీ ముంబైను దోచుకోవడానికి వస్తున్నారంటూ ఆరోపించారు. బీజేపీ బందిపోటు ముఠాను తరిమికొట్టాలని మహారాష్ట్ర ఓటర్లకు పిలుపునిచ్చారు. బీజేపీ వెన్నుపోటు రాజకీయాలతో ప్రతిపక్ష ప్రభుత్వాలపై కుట్రలు చేస్తుందని ఆరోపించారు. అలాంటి బీజేపీని ఈ ఎన్నికల్లో పాతిపెట్టాలని పిలుపునిచ్చారు.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# మోడీది ఒకటే డైలాగ్... బోరు కొడుతోందా ?

ఎన్డీయే సారధిగా పదేళ్లుగా కేంద్రంలో ప్రధానిగా అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ విపక్షల మీద చేసే విమర్శలు ఫుల్ రొటీన్ గా ఉంటున్నాయా అన్న చర్చ సాగుతోంది. అవి బాగా అరిగి పోయిన డైలాగులుగా మారిపోయాయా అన్న మాట కూడా వినిపిస్తోంది. అదే టైం లో మోడీ చేస్తున్న ఈ విమర్శలలో పంచులు పెద్దగా పేలడం లేదా అన్నది కూడా అంతా అంటున్న మాటగా ఉంది. ఎన్నికలు వస్తే చాలు విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ప్రచారానికి వచ్చే మోడీ అక్కడ వారి అవినీతిని ఎండగడుతున్నారు. సరే ఆయన ప్రత్యర్ధులను విమర్శించడాన్ని ఎవరూ తప్పుపట్టారు. కానీ ఆయన ధాటీగా చేస్తున్న ఆ విమర్శలు ఆ తరువాత మాత్రం ఎటూ కాకుండా పోతున్నాయి. అంటే వాటికి కొనసాగింపు అసలు ఉండడం లేదు అని అంటున్నారు. అదెలా అంటే దేశానికి పెద్దగా ప్రధాని స్థానంలో ఉన్న నాయకుడు చేసే తీవ్రమైన ఆరోపణల మీద దేశమంతా ఆసక్తిగా చూస్తుంది. వాటి మీద చర్యలు ఉంటాయేమో అని కూడా ఆలోచిస్తుంది. ఒక ప్రధాని తన వద్ద ఆధారాలు పూర్తిగా ఉండబట్టే ఈ తరహా ఆరోపణలు చేస్తారు అని కూడా భావిస్తుంది. అయితే నరేంద్ర మోడీ మాత్రం తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నారు, ఆ మీదట వాటి ఊసు అయితే కనిపించడం లేదు అని అంటున్నారు. దానికి ఉదాహరణలు కూడా ఎన్నో చెబుతూంటారు. 2019 ఎన్నికల వేళ ఏలూరు బీజేపీ సభలో ప్రధాని మాట్లాడుతూ ఆనాటి టీడీపీ ప్రభుత్వం మీద విమర్శలు గుప్పించారు. పోలవరం ప్రాజెక్టు చంద్రబాబుకు ఏటీఎం గా మారింది అని అతి పెద్ద ఆరోపణ చేశారు. దాని మీద చర్చ చాలా పెద్ద ఎత్తున సాగింది కూడా. తీరా చూస్తే ఏపీలో చంద్రబాబు ఓటమి పాలు అయ్యారు. కేంద్రంలో బీజేపీ గెలిచింది. కానీ ప్రధాని చంద్రబాబు మీద చేసిన ఆరోపణల మీద విచారణ ఏమైనా జరిగిందా అంటే లేదు, తీరా 2024 ఎన్నికలకు వచ్చేసరికి ఏపీలో టీడీపీ కూటమితో కలసి బీజేపీ పోటీ చేసింది. ఇది ఒక ముచ్చట అయితే 2024 ఎన్నికల వేళ ఏపీలో అధికారంలో ఉన్న జగన్ మీద కూడా ప్రధాని హోదాలో నరేంద్ర మోడీ తీవ్ర ఆరోపణలు చేశారు. అవినీతి ఆరోపణలు కూడా చేశారు. ఇపుడు అయిదు నెలల పాలన కేంద్రం పూర్తి చేసుకుంది. మరి జగన్ మీద చేసిన ఆరోపణల మీద పర్యవసానాలు ఏమిటి అంటే జవాబు లేదు అని అంటున్నారు. ఇక కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలోని ముఖ్యమంత్రుల మీద కూడా ప్రధాని ఆరోపణలు చేస్తూంటారు. అక్కడ అవినీతి జరిగిందని అంటారు. ఆ డబ్బులను ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీకి నిధులుగా వాడుతున్నారు అని కూడా ఆరోపిస్తూంటారు. లేటెస్ట్ గా చూస్తే అలాంటి ఆరోపణలు కర్ణాటక కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మీద చేశారు. దాంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ మీద తనదైన శైలిలో కామెంట్స్ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ తన మీద చేసిన ఆరోపణలను ఆధారాలతో సహా నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటాను అని కూడా సిద్ధరామయ్య సవాల్ చేశారు. ఇంతకీ సిద్ధరామయ్య మీద మోడీ చేసిన ఆరోపణలు చూస్తే కర్ణాటక ప్రజలను దోచుకుని ఆ డబ్బుని మహారాష్ట్ర ఎన్నికల కోసం కాంగ్రెస్ తరలిస్తోంది అని మోడీ ఆరోపించారు. దానికి చాలా సీరియస్ గా రియాక్ట్ అయిన సిద్ధరామయ్య ప్రధాని ఆ ఆరోపణలను నిరూపించాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సిద్ధరామయ్య మాట్లాడుతూ కర్ణాటక ప్రజలను దోచుకుని డబ్బులు తెచ్చి మహారాష్ట్ర ఎన్నికల్లో ఖర్చు చేస్తున్నామన్నది ఆధారం లేని ఆరోపణగా అంటున్నారు. ప్రధాని మోడీ అబద్ధాలతో కూడిన ఆరోపణలు చేస్తున్నారు అని ఆయన విమర్శించారు.

ఆయన అలా తమ మీద బురద జల్లి వెళ్లిపోతున్నారని కూడా అ సహనం వ్యక్తం చేశారు. అయితే ప్రధాని తాను చేసిన ఆరోపణలను ఆధారాలతో నిరూపించగలరా తన సవాల్ ని స్వీకరించాలని డిమాండ్ చేశారు. మరి సిద్ధరామయ్య చేసిన ఆరొపణలకు మోడీ కానీ బీజేపీ పెద్దలు కానీ ఎలా రియాక్ట్ అవుతారో లేక వాటిని అలా వదిలేస్తారో చూడాల్సి ఉంది అని అంటున్నారు.

# అతివలకు అవగాహన.. ప్రత్యేక కార్యాచరణ



కరీంనగర్ :ఉమ్మడి కరీంనగర్ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మరో కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వడంతోపాటు వ్యాపార రంగంలో రాణించడానికి శిక్షణ ఇస్తున్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా బ్యాంకు రుణాలు ఇప్పించి వ్యాపారాలు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 14వ తేదీ నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కొత్త సభ్యురాళ్లను చేర్పించడం, కొత్త సంఘాలు ఏర్పాటు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రామాల్లో అవగాహన కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

**ఏం చేస్తారంటే..**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నూతన సభ్యురాళ్లతో సంఘం ఏర్పాటు చేయడం, సంప్రదాయ పద్ధతిలో బొట్టుపెట్టి సంఘంలోకి ఆహ్వానించడం, లాభాలను వివరించడం, బ్యాంకు ఖాతా ఇప్పించడం, ఒక్కో నియోజకవర్గానికి ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా 100 మందికి బ్యాంకు లీంకేజీతో రుణాలు ఇప్పించి వ్యాపారాలు ప్రారంభించడం చేస్తారు.

**ప్రత్యేక కమిటీలతో సహాయం**

సంఘంలో ఉండటంతో కలిగే ఆర్థిక ప్రయోజనాల గురించి అవగాహన కల్పిస్తాం. నియోజకవర్గానికి 100 మందికి బ్యాంకు లీంకేజీ ద్వారా రుణాలు అందించి వ్యాపారాలు ప్రారంభించేలా సహకరిస్తాం. రానున్న రోజుల్లో మహిళలకు ఎదురయ్యే ఇబ్బందులపై ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి వారికి సహాయం అందించేలా ఉన్నతాధికారులు తగిన కమిటీలకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. సునీత, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి

**గ్రూపులో చేరడంతో లాభాలు**

గ్రామీణ ప్రాంతానికి చెందిన 18 ఏళ్ల మహిళలు అర్హులు. స్థానిక నివాసురాలై ఉండాలి. దారిద్ర్యరేఖకు దిగువన ఉండాలి.
సంఘానికి బ్యాంకు లీంకేజీతో ప్రస్తుతానికి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నారు. అసలు, వడ్డీ చెల్లించిన వారికి.. కొన్నేళ్లకు వడ్డీపై మాఫీ వస్తుంది.
సభ్యురాళ్లు రుణం తీసుకొని ఎవరైన సహజంగా మరణిస్తే రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల వరకు బీమా అందుతుంది.సభ్యురాళ్లకు వ్యక్తిగత రుణం రూ.10 లక్షల వరకు తీసుకోవడానికి అధికారులు సహకరిస్తున్నారు. ఏదైనా వ్యాపారంలో రాణించాలనుకుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్తే శిక్షణ ఇస్తున్నారు. పిల్లలకు విద్యా రుణాలు అందించడానికి చర్యలు తీసుకుంటారు. ప్రతినెల పొదుపు చేసుకోవడం ద్వారా ఆర్థిక క్రమశిక్షణ వస్తుంది. స్త్రీనిధి ద్వారా ప్రత్యేక రుణాలు తీసుకొని చెల్లించవచ్చు. ఈ రుణాలపై కూడా ప్రమాద బీమా ఉంటుంది. సభ్యురాళ్లు మరణిస్తే రుణం మొత్తం మాఫీ అవుతుంది.

# భర్తీకాని సీట్లు




జగిత్యాల : రూ.కోట్లు వెచ్చించి గురుకులాలు నిర్వహిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో విద్యార్థులు ఆసక్తి కనబరచడం లేదు. మైనారిటీ సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఏటా వందల సంఖ్యలో సీట్లు మిగిలిపోతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సీట్ల మిగులుపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.ఉమ్మడి జిల్లాలో మొత్తం 19 మైనారిటీ బాలబాలికల గురుకుల పాఠశాలలు, వీటికి అనుబంధంగా అవే భవనాల్లో 19 జూనియర్ కళాశాలలు కొనసాగుతున్నాయి. పాఠశాలకు మూడేళ్లలో మొత్తం పాఠశాలల్లో కలిపి మంజూరైన 25,360 సీట్లలో కేవలం 17,058 సీట్లు మాత్రమే భర్తీ కాగా 8302 ఖాళీగానే మిగిలిపోయాయి. మొత్తంగా చూస్తే మూడేళ్లలో భర్తీ అయిన సీట్లు 67 శాతం ఉండగా మూడో వంతు సీట్లు మిగిలిపోయాయి. గురుకుల జూనియర్ కళాశాలల వరకు వసే కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో 2022 విద్యా సంవత్సరంలో 1900 సీట్లకు 898 మాత్రమే భర్తీ అయ్యాయి. 2023 సంవత్సరంలో 880, ప్రస్తుత విద్యా సంవత్సరంలో 939 సీట్లు నిండాయి. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 2022 విద్యా సంవత్సరంలో 1100 సీట్లకు 509, 2023లో 513, ప్రస్తుత విద్యా సంవత్సరంలో 568 సీట్లు మాత్రమే భర్తీకి నోచుకున్నాయి.


**ప్రభుత్వానికి నివేదిక పంపిస్తున్నాం**

ఏటా భర్తీ అయిన సీట్లు, మిగిలిన సీట్ల వివరాలు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. ఆశించిన స్థాయిలో మైనారిటీ వర్గాల జనాభా లేకపోవడం, వసతి గృహాల్లో ఉండేందుకు విద్యార్థులు ఆసక్తి చూపకపోవడంతో మొత్తం సీట్లు భర్తీ కావడం లేదు. ఇందుకోసం ఏటా మైనారిటీ వర్గాలున్న ప్రాంతాల్లో చైతన్యం కల్పించి అవగాహన పెంపొందిస్తున్నాం. మిగులు సీట్ల విషయంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వ్యవహరిస్తున్నాం.డాక్టర్ దాసరి రాజేందర్, ఆర్ఎల్సీ

**నిబంధనలే అడ్డంకి**

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో భర్తీ కాని సీట్లను, కటాఫ్ గడువు తరువాత స్పాట్ సెలెక్షన్ కింద భర్తీ చేస్తారు. వచ్చిన దరఖాస్తుల్లో ప్రతిభ తదితర అంశాల ఆధారంగా ప్రాధాన్యం కల్పిస్తారు. అయితే మైనారిటీ సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రత్యేకంగా మైనారిటీ కోటా సీట్లు పోగా, తక్కినవి ఇతర వర్గాలకు అవకాశం కల్పిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మైనారిటీ కోటాలో భర్తీ కాని సీట్లు ఇతరులకు కేటాయించే అవకాశం లేదు. దీంతో ఏటా పెద్ద సంఖ్యలో సీట్లు మిగులుతున్నప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెసులుబాటు కల్పిస్తే తప్ప పరిస్థితి మారే అవకాశం లేదు.

# కాగితాల్లోనే కమిటీలు.. నీరుగారుతున్న నిర్వహణ



గోదావరిఖని : పట్టణ స్థానిక సంస్థల నిర్వహణలో ప్రజలను భాగస్వామ్యులను చేయాలనే లక్ష్యంతో వివిధ రకాల కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వం మార్గదర్శనం చేసినా నేటికీ ఆచరణకు నోచుకోవడం లేదు. నగర, పురపాలక ఎన్నికల ప్రక్రియ పూర్తయిన వెంటనే ఆయా డివిజన్లలో అభివృద్ధి పనుల నిర్వహణతో పాటు మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషించాలనే ఉద్దేశంతో వార్డు కమిటీలను ఏర్పాటు చేశారు. దీనికి తీవ్రమైన పోటీ ఏర్పడింది. అనర్హులను కమిటీలో చేర్చాలనే ఆందోళనలు వ్యక్తం కాగా మహిళా కార్పొరేటర్లు ఉన్నచోట వారి భర్తలు వార్డు కమిటీల్లో ప్రాతినిధ్యం వహిస్తూ అధికారికంగా సమావేశాల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు భావించారు. కమిటీల ఏర్పాటు మినహా ఆయా డివిజన్లలో సమస్యలు, అభివృద్ధి పనులకు సంబంధించి ప్రస్తావనే లేదు.

**ఆచరణ అంతంతే...**

నగరాలు, పట్టణాల్లో నీటి సరఫరా మెరుగు పరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై స్వశక్తి సంఘాలతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. తద్వారా ఆయా కాలనీల్లోని తాగునీటి సమస్య స్వశక్తి మహిళలు నేరుగా కమిటీ సమావేశాల్లో చర్చించి అధికారులు, పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకునే అవకాశం ఉండేది. ఇదే భావనతో కమిటీల ఏర్పాటునకు ప్రభుత్వం ఆదేశించినా ఆచరణకు నోచుకోవడం లేదు. నగరాలు, పట్టణాల్లోని ఉద్యానవనాల నిర్వహణ నీరుగారి పోతోంది. కాలనీల అభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు స్వశక్తి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కమిషనర్ కన్వీనర్‌గా ఉద్యావనాల నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఎక్కడా కమిటీల ఏర్పాటు జరగకపోగా ఉద్యానవనాల నిర్వహణ కరవైంది. సీనియర్ సిటిజన్ హాళ్ల నిర్వహణకు స్థానిక వయోవృద్ధులతో కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఆచరణకు నోచుకోవడం లేదు.

**సమస్యల పరిష్కారం కరవు...**

పర్యవేక్షణ లోపం కారణంగా రామగుండం కార్పొరేషన్ పరిధిలో పలు సమస్యలు యథావిధిగా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. స్వతంత్రచౌక్, మారుతినగర్ ప్రాంతాల్లో తాగునీరు కలుషితమవుతోంది. మురుగు నీరు సరఫరా కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతినిత్యం నీటి సరఫరా చేయాల్సి ఉండగా రెండు, మూడు రోజులైనా నగరపాలక కొళాయిల్లో నీరు రాని కాలనీలున్నాయి. ఇంటి నుంచే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని.. పొడి చెత్తను పునర్వినియోగానికి, తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారీకి చర్యలు తీసుకోవాలని ఎప్పటికప్పుడు ప్రభుత్వం ఆదేశిస్తున్నా రామగుండం నగరపాలికలో ఆచరణకు నోచుకోవడం లేదు. అంతర్గత మురుగు కాలువల నిర్వహణ గాడి తప్పడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. శిథిలమైన రహదారులు, మురుగు కాలువలతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో స్థానికులతో ఏర్పాటు చేసిన వివిధ కమిటీలకు ప్రాధాన్యం కల్పిస్తే ఎప్పటికప్పుడు ఆయా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# సిబ్బంది కొరత.. కానరాని సమయపాలన

ఇబ్రహీంపట్నం: పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించే ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత భారీగా ఉంది. సిబ్బంది కొరతతో రోగులకు 24 గంటలు వైద్య సేవలు అందడం లేదు. పలువురు సిబ్బంది సమయపాలన పాటించక పోవడంతో రోగులకు ఎదురుచూపులు తప్పడం లేదు. రోగుల తాకిడి అధికంగా ఉంటున్నప్పటికీ సరిపడా వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీకాక పోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఖాళీలను భర్తీ చేయడంతో పాటు సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**పర్యవేక్షణ కరవు**

రాయికల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గతంలో 30 పడకలతో వసతులు సమకూర్చి సామాజిక ఆరోగ్య కేంద్రంగా ఉన్నతీకరించారు. స్థాయి పెరగడంతో మెరుగైన వైద్యం అందాల్సి ఉండగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరవై వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో రోగులకు అరకొర వైద్యం అందుతుంది. 24 గంటలు వైద్య సేవలు అందించాల్సి ఉండగా మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆసుపత్రి ఖాళీ అవుతుంది. ఇక సెలవు రోజుల్లో వైద్య సేవలు సరేసరి. ప్రస్తుతం ప్రసవాలు నామమాత్రంగా జరుగుతున్నాయి. ఆరుగురు వైద్యులు, ఒక డెంటల్ అసిస్టెంట్, 12 మంది స్టాఫ్ నర్సులు ఉన్నారు. నిబంధనల మేరకు మొత్తం 27 మంది సిబ్బంది ఉండాలి. జనరేటర్ సౌకర్యం కల్పించి మురుగు నీటి పైపులకు మరమ్మతు చేపట్టాలి. వర్షాలకు భవనంలో లీకేజీ ఎర్పడుతుంది. ఎక్స్‌రే, గర్భిణులకు స్కానింగ్ వంటి పరీక్షలు చేపట్టడం లేదు. ఇటీవలే సీబీపీ యంత్రాన్ని అందుబాటులో ఉంచారు.

**అందని పరీక్ష నివేదికలు**

మల్యాల ప్రభుత్వాసుపత్రిలో ఇద్దరు వైద్యులకు ఒకరు కల్లెడ ఆసుపత్రికి డిప్యుటేషన్‌పై బదిలీకావడంతో వైద్యురాలు ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. మేల్ సూపర్‌వైజరు, కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు, నాలుగు ఏఎంఎన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆసుపత్రిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వహిస్తుండగా, సాయంత్రం వేళల్లో రోగులు ఆసుపత్రికి వెళ్తే సిబ్బంది అందుబాటులో ఉండటంలేదు. ఆసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మించిన భవనాన్ని ఏడాది కిందట ప్రారంభించినా ఇప్పటికీ వినియోగంలోకి తేలేదు. కంటి పరీక్షలు చేసేందుకు ఆప్తాల్మిక్ అధికారి ప్రతి మంగళవారం సందర్శించాల్సినప్పటికీ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షల కోసం వెళ్తుండటంతో దాదాపు మూడు నెలలుగా ఆసుపత్రికి రావడంలేదు. తెల్లకాగితాల కొరత కారణంగా ల్యాబ్‌లో రిపోర్టు పత్రాలు అందజేయడంలేదు.

**నిరుపయోగంగా శస్త్రచికిత్స గది**

ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సేవలు అందడం లేదు. ఆరోగ్య కేంద్రానికి రెండు వైద్యుల పోస్టులు ఉండగా రెండు ఖాళీగా ఉన్నాయి. బండలింగాపూర్ పల్లె దవాఖానా వైద్యుడికి అదనపు బాధ్యతలు అప్పగించారు. వైద్యుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పల్లె దవాఖానా విధులతో పాటు ఇతర అధికారిక సమావేశాలు, కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంటుండంతో వైద్యుడి రాక కోసం రోగులు ఎదురు చూడాల్సి వస్తోంది. ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులతో పాటు, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎం ఇతర పోస్టులను భర్తీ చేయాలని రోగులు కోరుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవనం ఉండగా గైనకాలజిస్ట్ లేకపోవడంతో అన్ని రకాల సౌకర్యాలతో ఏర్పాటు చేసిన శస్త్రచికిత్స గది నిరుపయోగంగా ఉంది. నిత్యం ఓపీ అధికంగా ఉంటున్నప్పటికీ వైద్యులు లేని సమయంలో సిబ్బందే ప్రాథమిక చికిత్స చేసి, మందులు ఇచ్చి పంపిస్తున్నారు.

**ఖాళీలతో సతమతం**

కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరతతో ఇబ్బందికరంగా మారింది. 24 గంటల పీహెచ్‌సీ అయినప్పటికీ ప్రసవాలు జరగడం లేదు. గర్భిణులను కోరుట్ల ఏరియా ఆసుపత్రికి పంపించి ప్రసవాలు చేయిస్తున్నారు. ఆసుపత్రిలో ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా ఒక వైద్యుడి పోస్టు ఖాళీగా ఉంది. ఒక స్టాఫ్‌నర్సు, ఎనిమిది ఏఎన్ఎం పోస్టులకు 4 ఖాళీగా ఉన్నాయి. ఉన్న వైద్య సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాధారణ వైద్య సేవలందిస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులను కోరుట్ల, జగిత్యాల ఏరియా ఆసుపత్రులకు తరలిస్తుంటారు. అన్ని రకాల మందులు, టీకాలు అందుబాటులో ఉన్నాయి. పూర్తిస్థాయి వైద్య సిబ్బంది లేకపోవడంతో ప్రజలకు వైద్య సేవలందించడం కష్టంగా మారింది.

**శిథిలావస్థలో క్వార్టర్లు**

మల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 24 గంటల ఆసుపత్రిగా అనుమతులు మంజూరు చేసినప్పటికీ ఒకే వైద్యురాలిని నియమించారు. మరో వైద్యుడి పోస్టును భర్తీ చేయాల్సి ఉంది. స్టాఫ్ నర్సులు 02, ఏఎన్ఎంలు 08, ఇతర సిబ్బంది కొరత ఉంది. ఆసుపత్రి ఆవరణలో సిబ్బంది కోసం నిర్మించిన క్వార్టర్లు శిథిలావస్థకు చేరడంతో వాటిని వినియోగించడం లేదు. మరమ్మతు చేపట్టాలని కోరుతున్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోక పోవడంతో నిరుపయోగంగా ఉంటున్నాయి. ఆరోగ్య కేంద్రంలో వారం రోజులుగా మందుల కొరత ఉంది.

# ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. ఏర్పాట్లు గగనం

ధర్మపురి : ధర్మపురి క్షేత్రానికి కార్తిక మాసం సందర్భంగా భక్తుల తాకిడి పెరిగిన తగిన ఏర్పాట్లు, వసతుల కల్పనలో అధికారులు విఫలమవుతున్నారు. గత మూడు రోజులుగా రద్దీ అధికంగా ఉండటంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఉండటానికి వసతి గృహాలు.. రాకపోకలకు బస్సు సౌకర్యాలు లేక దూర ప్రాంతాల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరుబయట, మెట్లపైనే నిద్రిస్తున్నారు. గుడిలో.. ఆవరణలో భద్రత ఏర్పాట్లలో కూడా లోపాలు కనిపిస్తున్నాయి. శుక్రవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా ఎక్కువ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అధికారులు వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**8 దాటితే రాకపోకలు బంద్**

కరీంనగర్ నుంచి వయా రాయపట్నం మీదుగా ధర్మపురి క్షేత్రానికి ప్రతిరోజు భక్తులు వస్తుంటారు. అయితే ఉమ్మడి జిల్లా కేంద్రం నుంచి ధర్మపురికి బస్సు లేదు. మంచిర్యాల, ఆదిలాబాద్ వెళ్లే బస్సుల్లో వెళ్లి.. రాయపట్నం వద్ద దిగాలి. మళ్లీ అక్కడి నుంచి ఆటో లేదా బస్సులో గుడికి చేరుకోవాలి. దీంతో పెద్దపల్లి, కరీంనగర్, ఉమ్మడి వరంగల్‌కు చెందిన భక్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ధర్మపురికి రాకపోకలు సాగించడానికి 8 గంటలు దాటితే బస్సులు ఉండకపోవడం సమస్యగా మారింది.

**లోపాలు స్పష్టం**

పైరవీకారులు దర్శనానికి డబ్బులు తీసుకుని ఆలయంలోకి పంపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వత్తులు, దీపాలు, ఇతర సామగ్రి దుకాణాలు ఏకంగా ఆలయం లోపలే ఏర్పాటు చేశారు. ఉసిరికాయ చెట్టు వద్ద పెద్ద ఎత్తున దీపాలు వెలిగిస్తుండటంతో మహిళల చీరలకు మంటలు అంటుకొని ప్రమాదం జరిగే అవకాశం ఉంది. భక్తులు వెలిగించిన దీపాలను కార్మికులు ఎప్పటికప్పుడు తొలగించాలి. దేవస్థానం ముందు వరకు వాహనాలు అనుమతించిన నేపథ్యంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

# కమీషన్లు ఇస్తేనే .. ముందుకు

హైదరాబాద్: పలువురు అవినీతి ఇంజినీర్లు మరీ బరితెగిస్తున్నారు. సాధారణ గుత్తేదారులను డిమాండ్ చేసినట్లుగానే.. వారసత్వ కట్టడాలను పునరుద్ధరించే సంస్థలనూ వేధిస్తున్నారు. సాఫీగా సాగుతోన్న పనులకు అడ్డుపడుతున్నారు. ఈ వేధింపులు, సర్దార్‌మహల్‌ను పునరుద్ధరిస్తోన్న సంస్థను తాకాయి. అధికారులు కమీషన్లు అడగడంతో.. "మేము తాపీ మేస్త్రీ పనులు చేయట్లేదు. ఏళ్లనాటి వారసత్వ కట్టడానికి పూర్వవైభవాన్ని తీసుకొస్తున్నాం"అంటూ పనులు చేపట్టిన కన్సల్టెన్సీ నిపుణులు పలువురు ఇంజినీరింగ్ అధికారులకు తెగేసి చెప్పారు. అవసరమైతే కాంట్రాక్టు నుంచి తప్పుకుంటామని స్పష్టం చేశారు. పలువురు అవినీతి ఇంజినీరింగ్ అధికారుల తీరుతో వారసత్వ కట్టడాల పునరుద్ధరణ నత్తనడకన సాగుతోందనే విమర్శలొస్తున్నాయి.

**అటకెక్కిన పనులు..**

నగరవ్యాప్తంగా 142 వారసత్వ కట్టడాలున్నాయి. ఆయా కట్టడాలను



తిరిగి నిర్మించే పనులు మూడేళ్ల కిందట మొదలయ్యాయి. పురోగతి లేదు. నిధుల సమస్య, ఇంజినీర్ల చేతివాటం, స్థానిక సమస్యలు కారణమవుతున్నాయి. సర్దార్‌మహల్ పునరుద్ధరణ పనులు రూ.30 కోట్లతో మొదలవ్వగా, ఇప్పటివరకు 20 శాతం పనులే పూర్తయ్యాయి. పనులకు పలువురు ఇంజినీర్లు అవాంతరాలను సృష్టిస్తున్నారనే విమర్శలున్నాయి.సర్దార్ మహల్‌కన్నా ముందు ముర్గీచౌక్ పునర్నిర్మాణం మొదలైంది. ప్రారంభంలో పనులు చకచకా సాగినా..పునాదులు పూర్తయ్యాక ఆగాయి. 6 నెలలుగా ఇటుక కదల్లేదు. పురోగతి 20 శాతమే.లాడ్‌బజార్ అభివృద్ధి పనులు ఏడేళ్లుగా నానుతున్నాయి. త్వరలో రూ.36 కోట్లతో టెండర్లు పిలుస్తామని కుసాడ్ ఇంజినీర్లు చెబుతున్నారు.మూడేళ్ల కిందట రూ.16 కోట్లతో మీరాలం మండి పునరుద్ధరణ పనులు మొదలవగా, ఇప్పటికీ పనులు పట్టాలెక్కలేదు.

# పాస్‌పోర్టు అంటారు.. మోసాలు చేస్తారు

హైదరాబాద్: పాస్‌పోర్టుల దరఖాస్తు, మంజూరు ప్రక్రియలో నకిలీ ఏజెంట్ల జోక్యానికి అడ్డుకట్ట వేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నా.. మోసపోతున్నవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. పోలీసుల నిఘా పెంచినా నాలుగైదు నెలల్లో 40 కేసులు నమోదయ్యాయి. దరఖాస్తు, మంజూరు ప్రక్రియ ఆన్‌లైన్‌లో జరుగుతుందని, ఏజెంట్లమంటూ వచ్చేవారి మాటలు నమ్మి మోసపోవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు పాస్‌పోర్టు సేవా కేంద్రాలు (పీఎస్‌కే), 14 పోస్టాఫీసు పాస్‌పోర్టు సేవా కేంద్రాలు (పీవో పీఎస్‌కేలు) సేవలందిస్తున్నాయి. రోజూ 3,800 సాధారణ, తత్కాల్ పాస్‌పోర్ట్, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికేట్ల (పీసీసీ) అపాయింట్‌మెంట్లు మంజూరు అవుతున్నాయి. గ్రేటర్‌లో 2,226 పాస్‌పోర్టు, 110 పీసీసీ అపాయింట్‌మెంట్లు మంజూరవుతుండటంతో నకిలీ ఏజెంట్లు తిష్ఠవేస్తున్నారు. ధ్రువపత్రాల సమర్పణకు వచ్చేవారిని అటకాయిస్తూ త్వరితగతిన



చేయిస్తామంటూ రూ.5,000 నుంచి రూ.10,000 వరకు వసూలు చేస్తున్నారు. ఉదంతాలివీ.. ఉప్పల్‌కు చెందిన శ్రీనివాస్.. తన కుమారుడి పాస్‌పోర్టుకు ఏజెంట్‌ను ఆశ్రయించారు. అతడి సూచనతో తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించాడు. స్క్రూటినీలో అధికారులు ఆరా తీయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఏజెంట్‌కు రూ.10 వేలు ఇచ్చి మోసపోయాడు.అమీర్‌పేట్, బేగంపేట్, టోలిచౌకి పీఎస్‌కేల వద్ద కొందరు ఏజెంట్లు వసూళ్లకు పాల్పడుతున్నారు. 3 రోజుల్లో పాస్‌పోర్టు వచ్చేలా చూస్తామంటూ బేరం కుదుర్చుకుంటున్నారు. డబ్బు తీసుకొని మొహం చాటేస్తున్నారు.కార్యాలయానికి వచ్చేవారిని అటకాయిస్తూ డబ్బులు దండుకుంటున్న ఘటనలు పెరగడంతో అధికారులు వాహనాలు నిలపకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వాహనం నిలిపిన వెంటనే టోయింగ్ వాహనం వచ్చి వాహనాలను తీసుకెళ్తుండటంతో పరిస్థితి కాస్త సద్దుమణిగింది. అవగాహన బోర్డులు ఏర్పాటుచేసి, పోలీసుల నిఘా పెంచారు.

# విద్యుత్తు ద్విచక్రవాహనాలదే హవా

హైదరాబాద్: విద్యుత్తు వాహనాల్లో మోటారు సైకిళ్లదే హవా. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్తు వాహనాల సంఖ్య 1.61 లక్షలు ఉండగా, గ్రేటర్ పరిధిలో 1.57 లక్షలు ఉన్నాయి. ఇందులో 1.43 లక్షల ద్విచక్ర వాహనాలే ఉన్నాయి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కేవలం 3,756 వాహనాలే ఉన్నట్లు రవాణా శాఖ గణాంకాలు చెబుతున్నాయి. విద్యుత్తు వాహనాల ఛార్జింగ్ కేంద్రాలు సైతం ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి. గ్రేటర్ పరిధిలో 600 వరకు ఛార్జింగ్ కేంద్రాలు ఉన్నాయి.

కొనుగోళ్లకు ప్రోత్సాహకాలు..విద్యుత్తు కొనుగోలు దారులను ప్రోత్సహించేందుకు పన్ను రాయితీ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2021లో ఉత్తర్వులు జారీ చేసింది. ద్విచక్ర వాహనాలు రెండు లక్షలు రిజిస్టర్ అయ్యేంత వరకు రోడ్ ట్యాక్స్‌తో పాటు రిజిస్ట్రేషన్ ఫీజు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటి వరకు కేవలం 1.43 లక్షల ద్విచక్ర వాహనాలు మాత్రమే రిజిస్టర్ అయ్యాయి. మరో 56 వేల వాహనాల వరకు రాయితీ లభించనుంది. విద్యుత్తు వాహనాలు మార్కెట్‌లోకి వచ్చిన తొలినాళ్లలో తరచుగా ప్రమాదాలు చోటు చేసుకోవటంతో.. కొనుగోళ్లు కొంత మందగమనంలో సాగాయి. గతంతో పోలిస్తే ప్రస్తుతం కొనుగోళ్ల సంఖ్య పెరుగుతోందని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. వ్యక్తిగత, వాణిజ్య అవసరాలకు వినియోగించే కార్లు పది వేల వరకు రోడ్డు ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజుల పూర్తి రాయితీ ప్రకటించింది. వ్యక్తిగత అవసరాలకు వినియోగించే 5 వేల కార్ల రిజిస్ట్రేషన్లు ఉత్తర్వులు జారీ చేసిన రెండేళ్లలో పూర్తయ్యాయి. వాణిజ్య అవసరాలకు వినియోగించే వాహనాల రిజిస్ట్రేషన్లు రెండు వేలకు మించకపోవటంతో సంఖ్యను మూడు వేలకు పరిమితం చేశారు.

# పత్తి శుద్ధి.. ఆదాయ లబ్ధి



తాండూరు : జిల్లాలో పత్తిని కొనుగోలు చేస్తున్న మిల్లర్లు ఆర్థిక లబ్ధి పొందుతున్నారు. అదే సమయంలో ఫీజుల రూపంలో సీసీఐకి ఆదాయం వస్తోంది. గ్రామాల నుంచి రైతులు వాహనాల్లో విక్రయానికి తీసుకు వస్తున్న పత్తిని తేమ శాతాన్ని బట్టి ధరను నిర్ణయిస్తున్నారు. ఆమేరకు కొనుగోలు చేసిన పత్తిని మిల్లుల్లో యంత్రాల ద్వారా శుద్ధి చేస్తున్నారు.

**క్వింటాలు గింజలు రూ.5,500కు విక్రయం**

పంజాబ్, హరియాణ రాష్ట్రాలకు మిల్లు నుంచి బయటకు వచ్చిన పత్తి గింజలను బస్తాల్లో నింపి లారీల ద్వారా పంజాబ్, హరియాణ రాష్ట్రాలకు టన్నుల కొద్దీ ఎగుమతి చేస్తున్నారు. ఒక్కో క్వింటాలు పత్తి గింజలను రూ.5,000 నుంచి రూ.5,500 చొప్పున విక్రయిస్తున్నారు. గింజలను కొనుగోలు చేసిన మిల్లర్లు యంత్రాల ద్వారా గింజల నుంచి నూనెను, పిండిని బయటకు తీస్తున్నారు. క్వింటాలు గింజల నుంచి 90 కిలోల పిండి, 10 కిలోల వరకు నూనెను ఉత్పత్తి చేస్తున్నారు. పిండిని అక్కడి పాడి పరిశ్రమలకు విక్రయిస్తున్నారు. ఆవులు, బర్రెలు పత్తి గింజల పిండిని తినడం ద్వారా పాల దిగుబడి ఎక్కువగా వస్తుంది.

**గుజరాత్, మహారాష్ట్రలకు సరఫరా**

మిల్లుల్లో పత్తిని నాణ్యంగా మార్చిన అనంతరం బేళ్లుగా తయారు చేస్తున్నారు. ఒక్కో పత్తి బేళు 168 కిలోల నుంచి 170 కిలోల వరకు ఉంటుంది. ఆర్డరు మేరకు గుజరాత్, మహారాష్ట్రలోని స్పిన్నింగ్ మిల్లులకు ఎగుమతి చేస్తున్నారు. బేల్స్ రూపంలో వచ్చిన పత్తిని పరిశ్రమల యజమానులు దారాలుగా మారుస్తున్నారు. వీటినే వస్త్రాల తయారీకి వినియోగిస్తున్నారు. గుజరాత్, మహారాష్ట్రలకు ఆర్డర్లు లేని సమయంలో జిల్లాలోని పత్తి మిల్లుల యజమానులు ఆంధ్రప్రదేశ్‌లోని స్పిన్నింగ్ మిల్లులతో పాటు హైదరాబాద్‌లోని మిల్లులకు ఎగుమతి చేస్తున్నారు. ఒక్కో బేల్ విక్రయం ద్వారా రూ.17,000 నుంచి రూ.22,000 ఆర్జిస్తున్నారు.

**ఫీజు రూపేణా సీసీఐకి**

మిల్లుల్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేస్తుంది. దీన్ని మిల్లర్లు నిర్ణీత లక్ష్యం మేరకు బేళ్లుగా తయారు చేసి సీసీఐకి అప్పగిస్తారు. సీసీఐ నిర్ణయించిన మేరకు మిల్లులకు ఛార్జీలను చెల్లిస్తుంది. ఒక్కో మిల్లులో ఎన్ని బేల్స్ తయారు చేసి ఇవ్వాలనే విషయంలో ఇప్పటికే సీసీఐ మిల్లర్లకు లక్ష్యాన్ని విధించింది.

**ఇవీ లెక్కలు**

మొత్తం పత్తి మిల్లులు: 14
పత్తి సాధారణ సాగు: 2,31,338 ఎకరాలు
సాగైంది: 2,56,698 ఎకరాలు
ఉత్పత్తి అయ్యే పత్తి: 3,08,038 మెట్రిక్ టన్నులు
కేంద్రాల్లో సీసీఐ కొనుగోలు చేసే పత్తి మెట్రిక్ టన్నుల్లో: 2,89,910
మిల్లర్లు కొనుగోలు చేసే పత్తి: 51,340 మెట్రిక్ టన్నులు

# సంచికి చిరుగు!



కరీంనగర్ : కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం గద్దపాక కొనుగోలు కేంద్రంలో హమాలీ మోస్తున్న ఈ సంచికి చిల్లులు పడటంతో ధాన్యం వృథాకాకుండా గడ్డి పరకలతో ఇలా ప్రయత్నం చేస్తున్నారు. ఇక్కడికి మొదటి దఫాగా వచ్చిన వాటిలో పాతవి అందించగా.. ఇటీవల రెండో దఫాగా కొత్తవి పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో ఇదే విధంగా పాత సంచులను అందించడంతో వాటిని తీసుకునేందుకు చాలా కేంద్రాల్లో అన్నదాతలు ముందుకు రాలేదు.

ఉమ్మడి జిల్లాలో ఇటీవలే ధాన్యం కొనుగోళ్లు ముమ్మరమయ్యాయి. కానీ ఎప్పటి మాదిరిగానే సమస్యలు ఎదురవుతున్నాయి. నిన్న మొన్నటి వరకు కల్లాల్లో కాంటాలు పెట్టడం లేదనే బాధ ఉండగా.. ఇన్నాళ్ల నిరీక్షణ తరువాత అందించే గన్నీ సంచులు నాసిరకంగా ఉండటం మరింత ఇబ్బందిని పెంచుతోంది. సీజన్‌లో ధాన్యం సేకరణ ప్రక్రియ కార్యాచరణ పౌరసరఫరాల శాఖ పర్యవేక్షణలో అధికారులు రూపొందించారు. పలు సమీక్షల్లో జిల్లా కలెక్టర్లకు అవసరమైన సంచులను ముందుగా సిద్ధం చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈసారి అవసరమైన సంచుల కోసం టెండర్లు నిర్వహించడంలో ఆలస్యం కావడం.. పైగా టెండర్లు కూడా పాత సంచుల కోసమే వేయడంతో జిల్లాకు అవే సరఫరా అయ్యాయని తెలుస్తోంది. గత సీజన్‌లో ఉపయోగించినవి పోనూ.. కొన్ని కొత్తవి జిల్లాలకు వచ్చాయి. ఇలా పాత, కొత్త కలయికతో కేంద్రాలకు గన్నీ సంచులను చేరవేశారు.

**రైతుకు కష్టమిలా..!**

కేంద్రాల్లో గత కొన్ని సీజన్ల నుంచి తరుగు కోసం 2-4 కిలోలను తీసుకుంటున్నారు. ఈసారి కూడా అది తప్పేట్లు లేదు. దీంతో అటు చిరుగులతో ధాన్యం కిందపడటంతోపాటు కాంటాలో తరుగు కోత వల్ల రెండు రకాల నష్టం ఎదురవుతుంది. రెక్కలు ముక్కలు చేసుకుని తీసుకొచ్చిన ధాన్యాన్ని చిరిగిన సంచుల్లో నింపడం కూడా ప్రహసనంగా మారుతోంది. చిల్లుల నుంచి కిందపడకుండా గడ్డి పరికలను అడ్డుపెడుతున్నారు. ప్రతి రైతుకు ఇచ్చే సంచుల్లో కొన్ని పాతవి కచ్చితంగా ఉంటున్నాయి. వాటిని తీసుకోకుంటే కొనుగోలు కేంద్రంలో ఇంకొన్నాళ్ళు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉంటుందని రైతులు వాటిని తీసుకుంటున్నారు. తరుగు కానీ.. చిరుగులతో నష్టం జరగనీ.. ఏదైతేనేమి పండించిన పంట కాంటా మీదికి పోతే చాలని అన్నదాతలు భావిస్తున్నారు. వీరి వ్యథను గమనించి అధికారులు అందుబాటులో ఉన్న పాత సంచుల చిరుగులకైనా కుట్లతో మరమ్మతు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఉన్నవాటినే సర్దుతూ..**

జగిత్యాల జిల్లాలో ఈ సీజన్‌లో ధాన్యం తరలింపునకు 1.15 కోట్ల బస్తాలు అవసరం. ఇందులో భాగంగానే 40 లక్షలు కొత్తవి సిద్ధం చేసి ఉంచారు. మిగతా సుమారుగా 75 లక్షల సంచులను పాతవే అందజేస్తున్నారు.

కరీంనగర్ జిల్లాలో కోటి అవసరమని అంచనా వేశారు. ఇందులో 46 లక్షలు పాతవి కాగా.. 54 లక్షలు కొత్తవి తేవాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు పాతవి, కొత్తవి కలిపి 45 లక్షల బస్తాలే ఉన్నాయి. ఇంకో 55 లక్షలు రావాల్సిన అవసరముంది.

పెద్దపల్లి జిల్లాలో కోటికిపైగా అవసరం. ప్రస్తుతం 23 లక్షలే ఉన్నాయి. ఇందులో పాతవి 14.60 లక్షలు, కొత్తవి 8.42 లక్షలు వాడుతున్నారు. మిగతా 77.88 లక్షల్లో కొత్తవి 46 లక్షలు, పాతవి 32 లక్షలు తీసుకొచ్చి రైతులకు ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలోనూ గతంలో వినియోగించినవాటిని 45 శాతం వాడుతున్నారు. ఇక్కడ దాదాపుగా 80 లక్షలకుపైగా సంచులు అవసరమవగా.. ఇప్పటి వరకు సగానికిపైగానే అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ కూడా కొన్ని కేంద్రాలకు చిరిగినవే అందాయి.

**ధాన్యం వృథా అవుతోంది..**

మా దగ్గర అందరికి పాత సంచులనే ఇచ్చారు. అందులో కొన్ని కుట్టినవి ఉండగా.. చాలా వరకు చిల్లులు పడి చిరిగినవే ఉన్నాయి. మంచివి ఇస్తే బాగుంటుంది. ఇందులో నింపి కాంటా వద్దకు వెళ్లేలోపు కొన్ని కిలోలు వృథాగా కిందపడిపోతాయి. పైగా కాంటా వద్ద కూడా తరుగు తీస్తే మాకు నష్టం జరుగుతుంది.తోట సతీశ్, రైతు, అబ్బాపూర్, జూలపల్లి

# రూ.8 కోట్లు వ్యయం.. నిరుపయోగం

సిరిసిల్ల : టీజీఐఐసీ ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో నిర్మించిన శీతల గిడ్డంగి, వేర్‌హౌస్ (ప్రాసెసింగ్ యూనిట్) నిర్లక్ష్యానికి గురవుతోంది. రైతులు, ఫల ఆధారిత పరిశ్రమలు నిర్వహించేవారు తోటకెళ్లి పండ్లు, కాయలు తెస్తే ఇక్కడ నిల్వ చేసుకోవచ్చు. రూ.8 కోట్ల వ్యయంతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో దీనిని నిర్మించారు. పక్కనే 2,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో వేర్‌హౌస్ (ప్రాసెసింగ్ యూనిట్) ఉంది. అయిదు ఎకరాల విస్తీర్ణంలోని ఈ యూనిట్‌ను 2023 ఏప్రిల్‌లో ఎల్లోస్ అండ్ గ్రీన్స్ అగ్రి ఫ్రెష్ కంపెనీకి కేటాయించారు. వారు ఇటీవల తమ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నారు. మామిడి, అరటి, జామ, బొప్పాయి వంటి పండ్లతో పాటు టమాటా వంటి ఉద్యాన పంటలను నిల్వ చేసుకునేందుకు పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు. 2023లోనే నిర్మాణం పూర్తయి ప్రారంభించినా ఇప్పటికీ నిరుపయోగంగానే ఉంది. జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లో మామిడి, పసుపు, మిర్చి వంటి ఉద్యాన పంటల విక్రయాలు జరుగుతాయి. రైతులు పంట ఉత్పత్తులు మార్కెట్‌కు తెచ్చిన వెంటనే మార్కెట్‌లోని ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇది అందుబాటులోకి వస్తే రైతులు తాము పండించే ఉద్యాన పంటల ఉత్పత్తులను నిల్వ చేసుకుని మంచి ధర వచ్చినప్పుడు విక్రయించుకునే వెసులుబాటు ఉంటుంది. ఇక్కడ పంట నిల్వలు ఉన్నాయంటే వాటి కొనుగోలుకు అక్కడికే వ్యాపారులు వస్తుంటారు. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన గిడ్డంగిని అన్నదాతలకు అందుబాటులోకి తెస్తేనే ఫలప్రదం అవుతుంది. ఈ విషయమై టీజీఐఐసీ ప్రాంతీయ మేనేజర్ పద్మజను వివరణ కోరగా దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు.

# ఐటీ కారిడార్.. ఫ్యూచర్ సిటీలపై నజర్

హైదరాబాద్: రాజధాని పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు కార్యాచరణ రూపొందించారు. శేరిలింగంపల్లి, గండిపేట, రాజేంద్రనగర్ మండలాల్లోని ఐటీ కారిడార్, మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని ఫ్యూచర్‌సిటీల ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టనున్నారు. ఈ ఏడాది జనవరి నుంచే ఆయా భూముల్లో ఆక్రమణలను తొలగిస్తున్నారు. సర్కారు స్థలాలు.. చెరువులను అక్రమార్కుల నుంచి రక్షించేందుకు డిజిటల్ సర్వేలు నిర్వహించనున్నారు.

**రికార్డుల్లో మాయాజాలం...**

ప్రభుత్వ భూములను సొంతం చేసుకునేందుకు అక్రమార్కులు రికార్డుల



ను మార్చేసినట్టు అధికారులు గుర్తించారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న భూముల్లో 60 శాతం నిజాం నవాబు హయాంలో దానమిచ్చినవే. వారసులు లేకపోవడంతో వాటిలో 90 శాతం ప్రభుత్వపరమయ్యాయి. అక్రమార్కులు తప్పుడు రికార్డులు సృష్టించడం, కొందరు నిజాం వారసుల నుంచి దానం పొందామని.. పత్రాలు సృష్టించి కోర్టులు ఆశ్రయిస్తున్నారు.శేరిలింగంపల్లి మండలంలోని మూడు గ్రామాల్లో 190 ఎకరాల ప్రభుత్వ భూములపై వివాదాలు కొనసాగుతున్నాయి. కొన్ని న్యాయస్థానాల్లో విచారణ స్థాయిలో ఉండగా, మరికొన్ని ట్రైబ్యునల్‌లో ఉన్నాయి.గండిపేట మండలంలోని నాలుగు గ్రామాల్లో 200 ఎకరాల భూములపై ప్రైవేటు వ్యక్తులు వివాదాలు సృష్టిస్తున్నారు. 20 ఏళ్ల క్రితం రికార్డులు మార్చి ధరణిలోనూ పేర్లు వచ్చేలా చేసుకున్నారు.మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని 4 గ్రామాల్లో రూ.వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకునేందు కు ప్రైవేటు వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు ప్రభుత్వ రికార్డులు మార్చేశారు.

# అమ్మకు కడుపుకోత

సిరిసిల్ల: తొలి కాన్పులో సహజ ప్రసవాలను ప్రోత్సహించడంలో వైద్య ఆరోగ్యశాఖ విఫలమవుతోంది. జిల్లాలో 80 శాతం గ్రామీణ ప్రాంతమే ఉంటుంది. 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అయిదు 24ఇ7 ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటితోపాటు జిల్లా జనరల్ ఆసుపత్రి, వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రితోపాటు ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట సామాజిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటి పరిధిలోని ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ప్రతి నెలా గర్భిణుల వివరాలు నమోదు చేయాలి. వీరికి అవసరమైన వైద్య పరీక్షలకు జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రులకు తీసుకెళ్లాలి. చాలా ఆరోగ్య కేంద్రాల్లో రికార్డుల్లో నమోదుకే పరిమితమవుతోంది. కొన్ని కేంద్రాల్లో వైద్య పరీక్షల వరకు పర్వాలేదు. ప్రసవ సమయానికి వచ్చేసరికి ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లడం లేదు.

అక్టోబరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 443 మంది గర్భిణులు నమోదవగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో 305 మంది మాత్రమే కాన్పులకు వచ్చారు. 138 మంది ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 74 శాతం, ప్రైవేటులో 90 శాతం శస్త్రచికిత్సలు జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లా జనరల్ ఆసుపత్రికి వచ్చే వారిలోనూ 70 శాతం శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. 2022లో జిల్లా వ్యాప్తంగా జరిగిన తొలి కాన్పులో 67 శాతం సాధారణ ప్రసవాలతో రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. ప్రస్తుతం ఎక్కువగా జరుగుతున్న శస్త్రచికిత్సలతో తల్లీబిడ్డలకు ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. తొలి కాన్పు సాధారణమైతే తల్లీబిడ్డలకు మేలు. అలాగే రెండో కాన్పుపై



దుష్ప్రభావం ఉండదు.

**స్త్రీ వైద్య నిపుణుల కొరత**

జిల్లా జనరల్ ఆసుపత్రిలో 8 మంది స్త్రీ వైద్యనిపుణులు అవసరం. వైద్యుల కోసం రెండు నెలల వ్యవధిలో రెండుసార్లు నోటిఫికేషన్ వేయగా నలుగురు మాత్రమే ఎంపికయ్యారు. అటు వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలోనూ ముగ్గురు స్త్రీ వైద్య నిపుణులు అవసరం కాగా, ఒక్కరు కూడా రాలేదు. దీంతో జిల్లా ఆసుపత్రిలోని ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లను వేములవాడకు పంపారు. జిల్లా ఆసుపత్రి డీఎంఈ పరిధిలో ఉండగా.. ప్రాంతీయ ఆసుపత్రి వైద్యవిధాన పరిషత్తులో ఉంది. దీంతో వీరి పని సమయాల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఇటీవల సిరిసిల్లలో అంబేద్కర్‌నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయగా అక్టోబరులో పది మంది గర్భిణుల వివరాలు నమోదై ఉన్నాయి. కలెక్టర్ వారికి ఫోన్ చేయగా ఎనిమిది మంది ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాలకు వెళ్లినట్లు తేలింది. ప్రసవాలపై ఆసుపత్రి సిబ్బంది రికార్డులకే పరిమితమవుతున్నారని గుర్తించిన కలెక్టర్ వైద్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి సాధారణ ప్రసవాలు పెంచాలని, ఆశా కార్యకర్తలు గర్భిణుల పేర్లు నమోదు చేయడంతోపాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వారు ప్రసవాలు చేసుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు.

**సాధారణ కాన్పులు జరిగేలా చూస్తున్నాం**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూస్తున్నాం. అత్యవసరమైతేనే సిజేరియన్లకు రిఫర్ చేస్తున్నాం. ప్రైవేటులో అనవసరంగా సిజేరియన్లు జరుగుతున్నాయని ఇటీవల తనిఖీలు నిర్వహించినప్పుడు తెలుస్తుంది. అలాంటి వాటికి నోటీసులు జారీ చేశాం. అలాగే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న నాలుగు స్కానింగ్ కేంద్రాలకు నోటీసులు ఇచ్చాం.వసంతరావు, డీఎంహెచ్‌వో

# సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

## వేములవాడలో వేగంగా సిద్ధమవుతున్న సభా ప్రాంగణం



**గంభీరావుపేట (సిరిసిల్ల) నవంబర్ 18(ప్రభాత సమాచారం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు వేములవాడ పట్టణంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 20న సీఎం పర్యట కొనసాగనుంది. ముందుగా శ్రీ రాజ రాజేశ్వర స్వామి వారి దర్శనం చేసుకున్న అనంతరం ఆలయంలోని కార్యాలయంలో అభివృద్ధి పనులు ఇతర అంశాలపై అధికారులతో చరించనున్నారు. అక్కడి నుంచి వేములవాడ గుడి చెరువు ప్రాంగణంలో సభా ప్రాంగణం వద్ద పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ నేతృత్వంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 20 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు రాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్, జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సోమవారం సాయంత్రం లోగా హెలీప్యాడ్ సిద్ధం చేయాలని ఆర్ & బి శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. షామియానా, బారికేడింగ్ చేసి భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. సానిటేషన్ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. బహిరంగ సభకు వచ్చే ప్రజల సౌకర్యార్థం మొబైల్ టాయిలెట్లు సమకూర్చాలని, ఒక్కో గ్యాలరీలో మానిటరింగ్ చేసేందుకు ఒక మండల స్థాయి అధికారి ఉంటారని పేర్కొన్నారు. బహిరంగ సభ కోసం బస్సులను సమకూర్చాలని సూచించారు. వీఐపీ, డయాస్, డ్యూటీ, రిసెప్షన్, మీడియా, తదితర పాస్ లను సిద్ధం చేయాలని ఆదేశించారు. గెస్ట్ హౌస్ లో సదుపాయాలు, శ్రీ రాజరాజేశ్వర స్వామి దర్శన ఏర్పాట్లను, భోజన వసతి, ఇతర అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేసే ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. పోలీస్ శాఖ తరపున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. అంబులెన్స్, బ్లడ్, నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేలా చూడాలన్నారు.



# వేములవాడ అభివృద్ధికి రూ.127 కోట్లు

హైదరాబాద్: వేములవాడలో అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ. 127.65 కోట్లు మంజూరు చేసింది. శ్రీరాజరాజేశ్వర ఆలయ కాంప్లెక్స్ విస్తరణ, భక్తుల సదుపాయాలకు రూ. 76 కోట్లు కేటాయించింది. వేములవాడ ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు రోడ్ల విస్తరణ చేపట్టనున్నారు. ఇందుకు అవసరమైన భూసేకరణకు ప్రభుత్వం రూ. 47.85 కోట్లు మంజూరు చేసింది. బతుకమ్మ తెప్ప నుంచి జగిత్యాల వరకు డ్రైనేజీ నిర్మాణానికి రూ. 3.8 కోట్లు కేటాయించింది.



# కేసీఆర్, రేవంత్‌రెడ్డి నైతిక విలువలు వదిలేశారు

హైదరాబాద్: రాష్ట్రంలో భారాస, కాంగ్రెస్ పార్టీలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. గతంలో భారాస ప్రభుత్వం ఎలా ఉందో.. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు కూడా అలాగే ఉందన్నారు. అదే రకమైన అవినీతి, గాలి మాటలు విని ప్రజలు విసిగిపోతున్నారన్నారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డి రాజకీయాల్లో నైతిక విలువలు వదిలేశారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ రూ. 7 లక్షల కోట్ల మేర అప్పులు చేశారన్నారు. రేవంత్ ఏకంగా అప్పుల కోసం ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారని మండిపడ్డారు. "రైతు భరోసా, రుణమాఫీ లేదు. పింఛన్లు పెంచుతామన్నారు.. ఒక్క రూపాయి పెంచలేదు, కొత్త పింఛన్లు ఇవ్వలేదు. రేవంత్‌రెడ్డి వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారు. హామీలన్నీ ఆయన గాలికొదిలేశారు. పైగా మహారాష్ట్రలో నిర్వహిస్తున్న ప్రచారంలో తెలంగాణ సస్యశ్యామలం అయిందంటూ మాట్లాడుతున్నారు. ఇంతకంటే అబద్ధాలు ఉంటాయా? కాంగ్రెస్, భారాస తమ వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. భాజపా (%దీఫ్రీ%) నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని భాజపా పోలింగ్ బూత్ కమిటీల నియామకం చేపట్టాలి. మళ్లీ మండల స్థాయి వర్క్‌షాపులు ఉంటాయి. ఈ నెల 22న దిల్లీలో జరగనున్న పార్టీ సంస్థాగత సమావేశాల్లో మండల, జిల్లా ఎన్నికల తేదీలు వస్తాయి. తెలంగాణలో పనిచేయడానికి గుత్తేదారులు ముందుకు రావడం లేదు. దేశంలో కాంగ్రెస్ పార్టీ మూడు రాష్ట్రాల్లో అధికారంలో ఉండి భ్రష్టు పట్టించింది" అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# సీఎం రేవంత్ సోదరుడి అరాచకాలు.. లగచర్ల ఘటనపై బీజేపీ ఎంపీల సంచలన వ్యాఖ్యలు



సంగారెడ్డి జిల్లా: సీఎం రేవంత్‌రెడ్డికు ఫార్మా కంపెనీలపై అంత ప్రేమ ఎందుకని బీజేపీ ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. ఇవాళ(సోమవారం) సంగారెడ్డి జిల్లాలోని సెంట్రల్ జైలు వద్దకు వెళ్లి లగచర్ల కేసులో జైలులో ఉన్న 16 మందితో బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, ఆ పార్టీ కీలక నేతలు ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీకి భూమి ఇవ్వబోమని 8 నెలలుగా ఆందోళన చేస్తున్నారని అన్నారు. బలవంతంగా భూములు లాక్కుంటామని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారని చెప్పారు. రైతులు ప్రజాభిప్రాయ సేకరణను బహిష్కరించారని అన్నారు. వాస్తవంగా ప్రజాభిప్రాయ సేకరణకు రాకపోతే వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక్కరే ఎందుకు వెళ్లారని నిలదీశారు. పోలీసుల వైఫల్యంతోనే ఈ ఘటన జరిగిందని చెప్పారు. సీఎం రేవంత్ సోదరుడు అక్కడ ఉన్న రైతులను బయపెట్టారని అన్నారు. భూములు ఎలాగైనా గుంజుకుంటామని చెప్పారన్నారు. ఈ ఘటన తర్వాత రాత్రి గ్రామాల్లోకి వచ్చి పోలీసులు ఇష్టం వచ్చినట్లుగా దాడి చేశారని అన్నారు. గొడవ జరిగిన ఘటనలో కాంగ్రెస్ పార్టీ వారిని వదిలేసి మిగతా వారిని అరెస్ట్ చేశారని మండిపడ్డారు. భూములు ఇవ్వమని చెబితే సీఎం రేవంత్ స్వయంగా వెళ్లి వారిని కలిసి మాట్లాడితే బాగుండేదని అభిప్రా యం వ్యక్తం చేశారు. కానీ ఇవన్నీ చేయకుండా భయపెట్టి దాడులు చేయించి ఇలా చేయడం కరెక్టు కాదని హితవు పలికారు. సీఎం సోదరుడు అక్కడికి వెళ్లవచ్చు కానీ తనను అక్కడికి వెళ్లకుండా ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. రైతులతో దౌర్జన్యంగా బెదిరించి సంతకాలు పెట్టించుకుంటున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి సీఎం అయితే తమ నియోజకవర్గం బాగుంటుందని అనుకుంటే మీరేమో జనాలపై కక్ష కట్టారని ధ్వజమెత్తారు. ఓటేసి గెలిపించిన జనాల కాంటే మీకు ఫార్మా కంపెనీ ముఖ్యమా అని ప్రశ్నించారు. సీఎం కొడంగల్ వాసి కాదు వలస వచ్చారని విమర్శలు చేశారు. మీకు నచ్చిన వారికి కంపెనీలు అప్పజెప్పడానికే ఫార్మా కంపెనీలు పెడుతున్నారా అని నిలదీశారు. వెంటనే లగచర్ల బాధితులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంథాలు వద్దు నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష ముఖ్యమని తెలిపారు. పేదల ఉసురు పోసుకున్న కేసీఆర్ ఇంటికి పోయారని.. మీరు 11 నెలలకే పేదల ఉసురు పోసుకుంటున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ అహంకారం వీడాలి..రైతులను ఒప్పించి భూములు తీసుకోవాలని డీకే అరుణ కోరారు.

**ఖమ్మంలో అరెస్ట్‌లు.. ఇప్పుడు దాడులు చేస్తారా: రాజేందర్ –** లగచర్ల ఘటన వెనుక కాంగ్రెస్ ప్రభుత్వ కుట్ర ఉందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. బేషరతుగా ప్రభుత్వం బాధితులకు క్షమాపణ చెప్పి వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దుర్మార్గంగా ప్రవర్తించి థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ అవసరాల కోసం భూములు తీసుకోవడం వేరు కానీ బడా కంపెనీలకు అప్పజెప్పడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లుగా కొడంగల్ నియోజకవర్గ రైతుల పరిస్థితి ఉందని చెప్పారు. కాంగ్రెస్ నేతలే ఈ ఘటనకు స్కెచ్ వేసుకుని ఈ దాడులు చేయించారని అంటున్నారని అన్నారు. 144 సెక్షన్ పెట్టి ప్రజాప్రతినిధులను అక్కడికి వెళ్లకుండా ఆపుతున్నారని ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో ప్రివిలేజ్ మోషన్ వేస్తామని అన్నారు.సీఎం రేవంత్ సోదరుడు అరాచకాలు నియోజకవర్గంలో ఎక్కువ అయ్యాయని ఆరోపించారు. నియంతలకు సందర్భం వచ్చినప్పుడు తెలంగాణ సమాజం బుద్ధి చెబుతుందని అన్నారు. రైతులకు సంకెళ్లు, థర్డ్ డిగ్రీ చేయడం కరెక్ట్ కాదని చెప్పారు. ప్రజల కన్నీళ్లు చూసినవాడు ఎప్పుడు బాగుపడరని అన్నారు. గతంలో ఖమ్మం రైతులకు సంకెళ్లు వేసిన వారికి పట్టిన గతే మీకు పడుతుందని హెచ్చరించారు. అధికారులు చట్టాన్ని పక్కన పెట్టి ఇలా చేయడం కరెక్ట్ కాదని అన్నారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్ల కోసం భూములు ఇస్తే ఉరుకోమని ఈటల రాజేందర్ హెచ్చరించారు.

# లగచర్లలో దాడి చేసింది కేటీఆర్ అనుచరులే: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్: వికారాబాద్ జిల్లా లగచర్లలో ఘర్షణకు దిగింది కేటీఆర్ అనుచరులేనని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. గతంలో తాము కూడా ఎన్నో నిరసనలు, ఉద్యమాలు చేశామని, ఏనాడూ పోలీసులు, కలెక్టర్లపై దాడికి పాల్పడలేదన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా శాంతియుతంగా ఆందోళన చేస్తే తప్పు లేదన్నారు. అయితే, లగచర్లలో భూములు లేని స్థానికేతరులను తీసుకొచ్చి గొడవ చేయించారని మండిపడ్డారు. నిందితుడు సురేశ్ మాజీ ఎమ్మెల్యేతో 90 సార్లు మాట్లాడారని అన్నారు. రేప్ కేసులో నిందితుడిగా ఉన్న సురేశ్ తన అనుచరుడేనని కేటీఆర్ కూడా గతంలో అంగీకరించినట్లు చెప్పారు. "మూసీ పునరుజ్జీవంపై భారాస రాద్ధాంతం సృష్టిస్తోంది. మూసీ పునరుజ్జీవం వద్దని మాజీ సీఎం కేసీఆర్ బయటకు వచ్చి చెప్పాలి. అలా చెప్తే పనులు ఆపేస్తాం. ఆర్ఆర్ఆర్‌కు ఇప్పటికే 90శాతం భూసేకరణ పూర్తి చేశాం. దీనికి సంబంధించి జనవరిలో టెండర్లు పిలుస్తాం. రైతులకు భూ పరిహారం చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభిస్తాం. రూ. వేల కోట్లు వచ్చే ఓఆర్ఆర్‌ను కేవలం రూ. 7 వేల కోట్లకే అప్పగించారు. గత ప్రభుత్వం ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టును 2016 నుంచి పెండింగ్‌లో పెట్టింది. ఆర్ఆర్ఆర్ భూసేకరణకు ఇచ్చే నిధులపై కేంద్రం స్పష్టత కోరితే ఇవ్వలేదు. గత ప్రభుత్వ వైఖరి వల్ల ఈ ప్రాజెక్టుపై అడుగు ముందుకు పడలేదు. ఓఆర్ఆర్ వల్లే ఆర్ఆర్ఆర్ కూడా హైదరాబాద్, తెలంగాణకు గేమ్‌ఛేంజర్ అవుతుంది. శ్రీశైలం క్షేత్రానికి రూ. 7 వేల కోట్లతో ప్రాజెక్టు సాధించనున్నాం. శ్రీశైలానికి రిజర్వ్ ఫారెస్ట్ గుండా 62 కి.మీ మేర సింగిల్ పిల్లర్ ఫ్లై ఓవర్ ప్రాజెక్టు సాకారం అవుతుంది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మూసీ ప్రాంతానికి మాత్రమే పరిమితమయ్యారు, యాదాద్రి జిల్లాలో పర్యటించాలి. కేంద్రమంత్రిగా సింగరేణి గురించి ఎందుకు ఆలోచించటం లేదు? మణిపుర్ ఘర్షణల గురించి ఈ కేంద్ర మంత్రులు ఎందుకు మాట్లాడరు?" అని కోమటిరెడ్డి ప్రశ్నించారు.

# ఎన్‌హెచ్‌ఆర్సీని కలిసిన లగచర్ల ఫార్మా బాధితులు.. ఏం చెప్పారంటే..

ఢిల్లీ: లగచర్ల ఘటనలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అరాచకాలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ ను ఇవాళ(సోమవారం) ఢిల్లీలో కలిసి ఫిర్యాదు చేశామని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ తెలిపారు. రైతుల జీవనాధారంగా ఉన్న భూమిని దౌర్జన్యంగా లాక్కునే ప్రయత్నం రేవంత్ ప్రభుత్వం చేసిందని ఆరోపించారు. దీనిని అడ్డుకునే క్రమంలో స్థానిక యువత అధికారులను అడ్డుకున్నారని... కొంత ఘర్షణ జరిగిందని చెప్పారు. దీన్ని ఓ సాకుగా చూపుతూ గ్రామస్తులపై పోలీసులు దౌర్జన్యం చేస్తున్నారని మండిపడ్డారు. చాలామందిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ సోదరుడు తిరుపతి రెడ్డి ఇప్పటికీ గ్రామస్తులను బెదిరిస్తున్నారని చెప్పారు.

వీటిపై ఫిర్యాదు చేశామని తెలిపారు. దీనిపై ఆదివాసీ బిడ్డ అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసే ప్రయత్నం చేస్తున్నామని సత్యవతి రాథోడ్ అన్నారు. లగచర్లలో అధికారులపై దాడి ఘటనలో అరెస్టయిన బాధిత రైతుల కుటుంబాల సభ్యులపై రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఢిల్లీకి వచ్చినట్లు తెలిపారు. ఈమేరకు జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను కలిసి రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులపై ఫిర్యాదు చేశామని సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు.



**న్యాయం చేయాలి: లగచర్ల ఫార్మా బాధితులు....** తమ భూమి విషయంపై తొమ్మిది నెలల నుంచి ధర్నాలు చేస్తున్నామని లగచర్ల ఫార్మా బాధితులు అన్నారు. 500 మంది పోలీసులు వచ్చి తమను కొట్టారని లగచర్ల ఫార్మా బాధితులు అన్నారు. అందరినీ జైలుకు పట్టుకుపోయారని చెప్పారు. తాము భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. తమ వారిని విడిచిపెట్టాలని కోరారు. తమకు న్యాయం చేయాలని అన్నారు. రేవంత్ రెడ్డి ఇలా చేస్తాడని తాము ఊహించలేదని లగచర్ల ఫార్మా బాధితులు ఎన్‌హెచ్‌ఆర్సీ ముందు ఆవేదన వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పనిని కూడా కక్షపూరితంగా చేయదు: మంత్రి పొంగులేటి

హైదరాబాద్: గత ప్రభుత్వం చేసిన తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం సరిదిద్దుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. మంచి ప్రతిపక్షంగా విలువైన సూచనలు ఇస్తే.. స్వీకరిస్తామన్నారు. ఎంతో దూరదృష్టితో కాంగ్రెస్ ప్రభుత్వం సర్వేను చేపట్టిందని చెప్పారు. అయితే, గత ప్రభుత్వం సమగ్ర సర్వే నివేదికను ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పనిని కూడా కక్షపూరితంగా చేయడం లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలోని నేతలు చేసిన అక్రమాలపై చట్టపరంగానే చర్యలుంటాయని మంత్రి పొంగులేటి తెలిపారు.



ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660